సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 30 । మార్చి । 2023



బంగారు నేత్రాల బహూకరణ

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): కాకినాడ సూర్యారావు పేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారికి నేహ అన్నపూర్ణ, కార్తీక్(బెంగళూరు) బుధవారం బంగారు కళ్లు, కనుబొమ్మలు బహూకరించారు.



రాములోరి పెళ్లి.. చూసేద్దాం మళ్లీ


జగదానంద కారకుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఊరూవాడా రాములోరి పెళ్లి వేడుకలకు సిద్ధమయ్యాయి.

10లో

శ్రీవారికి వెండి కిరీటం



ద్వారకాతిరుమల: ద్వారకా తిరుమల చిన వెంకన్నకు జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేటకు చెందిన పారేపల్లి కిరణ్ కుమార్ బుధవారం 490 గ్రాముల వెండి కిరీటాన్ని సమర్పించారు.



జయలక్ష్మికి కొత్త ఊపిరి

- కోయంబత్తూరు సంస్థ టేకోవర్‌కు ప్రయత్నం
- కొత్త పాలకవర్గం నేతృత్వంలో విస్తృత చర్చలు
- ఫలిస్తున్న మంతనాలు
- త్వరలోనే ఒప్పందం ఖరారు
- ఖాతాదారుల్లో భరోసాకు అడుగులు



జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ భవనం

సాక్షిప్రతినిధి, కాకినాడ: జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ ఖాతాదారులకు శుభవార్త. తమిళనాడుకు చెందిన ఓ బ్యాంకు దీనిని టేకోవర్ చేసి కష్టాల నుంచి ఒడ్డెక్కించేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సహకారశాఖ అధికారుల అజమాయిషీలో ఏర్పాటైన కొత్త పాలకవర్గం సొసైటీకి మళ్లీ ఊపిరి పోసేందుకు చేస్తున్న ప్రయత్నాలు దారి కొస్తున్నాయి. కాకినాడ సర్పవరం కేంద్రంగా జయలక్ష్మి సొసైటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు విశాఖ జిల్లాలో కలిపి 29 బ్రాంచిలతో నడిచేది. సుమారు 20వేల మంది డిపాజిటర్లు ఉన్నారు. ఒకే ఒక కుటుంబం, వారి బంధుగణంతో ఏర్పాటైన సొసైటీ పాలకవర్గం గతేడాది ఏప్రిల్‌లో బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది విశ్రాంత, చిరు ఉద్యోగులు, చిరు వర్తకులు, రైతులు నిలువునా మునిగిపోయారు. నమ్మి డిపాజిట్లు చేసి మోసపోయారు.

తేలిన లెక్కలు

సొసైటీలో డిపాజిట్లు రూ.520 కోట్లు, రుణాలు సుమారు రూ.703 కోట్ల మేర ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీటిలో రూ.123 కోట్లు సెక్యూర్డ్ రుణాలు. 365 మంది వద్ద రూ.580 కోట్ల మేర అన్‌సెక్యూర్డ్ రుణాలున్నాయని లెక్క తేలింది. ఈ మొత్తంలో సుమారు రూ.530 కోట్లు గత పాలకవర్గ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, వారి కుమారుడు కలిపి దుర్వినియోగం చేసినట్టు కొత్త పాలకవర్గం ప్రాథమికంగా గుర్తించింది. వీటికి సంబంధించిన రికార్డులు, ఖాతాదారుల రుణ పత్రాలు ప్రస్తుతం సీబీసీఐడీ పోలీసుల విచారణ కోసం స్వాధీనంలో ఉన్నాయి.

త్యాగరాజన్‌తో సానుకూలంగా చర్చలు

జయలక్ష్మి ఖాతాదారుల్లో విశ్వాసాన్ని కలిగించేందుకు కొత్త పాలకవర్గం గట్టిగా అడుగులేస్తోంది. సొసైటీ టేకోవర్ చేసేందుకు ఆసక్తి చూపుతున్న బడా ఫైనాన్స్ కంపెనీలతో నెల రోజులుగా విస్తృతంగా చర్చిస్తోంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన ఈ సంస్థలతో జరుపుతున్న చర్చలు ఫలప్రదమై ఓ కొలిక్కి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన త్యాగరాజన్ అండ్ కంపెనీ రిజర్వు బ్యాంక్ నిబంధనల ప్రకారం టేకోవర్ చేసేందుకు ఆసక్తి కనబరిచినట్లు భోగట్టా. గత నెలలో ఈ సంస్థ ప్రతినిధులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి.

రికార్డుల కోసం ట్రిబ్యునల్‌కు..

సొసైటీలో రెగ్యులర్ రుణాలు రూ.100 కోట్లు వరకు ఉన్నాయి. రుణగ్రహీతలను గుర్తించారు. వారు కూడా రుణాలు తిరిగి చెల్లించేందుకు ముందుకు వచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి అల్లుడే రూ.20 కోట్లు బకాయి పడటం విశేషం. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ఆయన సమ్మతించారని సమాచారం. ఎటొచ్చీ ఆ రుణగ్రహీతల భూముల డాక్యుమెంట్లు, రికార్డులు ప్రస్తుతం సీబీసీఐడీ స్వాధీనంలో ఉండటమే సమస్యగా తయారైంది. గత పాలకవర్గంపై కేసులు కొనసాగిస్తూనే సీఐడీ నుంచి ఈ రికార్డులను తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకు ట్రిబ్యునల్‌కు వెళ్లి అనుమతి తెచ్చుకోవాలని సహకార వర్గాలు చెబుతున్నాయి.

విశ్వాసం పెంచేందుకు..

భారీ మొత్తం డిపాజిట్ చేశాక ప్రస్తుత పాలకవర్గం ఆధ్వర్యంలోనే సొసైటీ నిర్వహించాలనేది త్యాగరాజన్ సంస్థ భావన. సంస్థ ప్రతినిధి లేదా, ఒకరిద్దరు అసోసియేట్ ప్రతినిధులను పాలకవర్గంలో తీసుకోవాలనే అంశంపై ఇరువైపులా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. భారీ డిపాజిట్లతో ఖాతాదారుల్లో నమ్మకం పెరిగితే సొసైటీ దారిలో పడుతుందని కొత్త పాలకవర్గం భావిస్తోంది. మే లేదా, జూన్ నెలలో త్యాగరాజన్ సంస్థతో ఒప్పందం కొలిక్కి వస్తుందంటున్నారు. మరోసారి ఏప్రిల్‌లో సమావేశం కానున్నారు. అన్ని సజావుగా సాగితే మే నెలాఖరుకు మెచ్యూరిటీ డిపాజిట్లను తిరిగి ఇవ్వాలనేది ప్రతిపాదన. వీటిని చెల్లించాక రుణాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నారు. ఈ విషయంలో ప్రతిబంధకాలను అధిగమించేందుకు ఏప్రిల్‌లో జరిగే రెండో దఫా చర్చల్లో తుది నిర్ణయానికి రానున్నారు.

అటాచ్డ్ ఆస్తులు లెక్కలేసుకున్నాకే..

జయలక్ష్మి సొసైటీలో త్యాగరాజన్ కంపెనీ రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్లు డిపాజిట్ చేసేందుకు ముందుకు వచ్చింది. గత పాలకవర్గ చైర్‌పర్సన్ విశాలాక్షి సహా డైరెక్టర్ల నుంచి అటాచ్ చేసిన ఆస్తుల విలువ లెక్కలేసుకున్నాకే త్యాగరాజన్ సంస్థ టేకోవర్‌కు ముందుకు వచ్చింది. అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.కోట్లలోనే ఉంటుందని కొత్త చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు సారథ్యంలోని పాలకవర్గ సభ్యులు గుర్తించారు. వివిధ ప్రాంతాల్లోని స్థిరాస్తుల విలువ రూ.600 కోట్లు పైమాటేనని లెక్కలేశారు. కాకినాడ సెజ్‌లోని 12 ఎకరాల విలువే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్లు ఉంటుందని అంచనా. ఇలా అటాచ్‌చేసిన ఆస్తులు వేలం వేయడం, రికార్డుల ప్రకారం ఉన్న రుణాలు తిరిగి రాబట్టడం ద్వారా సొసైటీకి మళ్లీ ఊపిరిపోయాలని కొత్త పాలకవర్గం ప్రయత్నిస్తోంది.

ప్రతి ఖాతాదారుడికి న్యాయం చేస్తాం



సొసైటీపై నమ్మకంతో డిపాజిట్లు చేసిన ఏ ఒక్క ఖాతాదారుడికి అన్యాయం జరగకుండా చూస్తాం. బాధిత ఖాతాదారులకు న్యాయం జరిగే వరకు పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తుంది. ఇందుకోసం ప్రభుత్వ సహకారంతో ప్రయత్నాలు చేస్తున్నాం. డిపాజిట్‌దారులకు మంచి చేయడంతోపాటు రుణాలను తిరిగి రికవరీ చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– గంగిరెడ్డి త్రినాథరావు, పాలకవర్గ చైర్మన్

సజావుగా 'పది' పరీక్షలు

- సమన్వయ కమిటీ సభ్యులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా సమీక్ష



అమలాపురం టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలి. పరీక్షా కేంద్రాలు ప్రశాంత వాతావరణంలో ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పరీక్షల నిర్వహణకు సంబంధించిన జిల్లా సమన్వయ కమిటీ సభ్యులకు సూచించారు. అమరావతి నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పదో తరగత పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లాతో పాటు డీఈవో ఎం.కమలకుమారితో పాటు సమన్వయ కమిటీ సభ్యులైన పలువురు జిల్లా అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో చర్చించారు. జిల్లాలో 374 ఉన్నత పాఠశాలలకు చెందిన 20,967 మంది పదో తరగతి విద్యార్థులు మొత్తం 111 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ఏప్రిల్ మూడు నుంచి 18వ తేదీ వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో పరీక్షా కేంద్రానికి ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించామన్నారు. ప్రశ్నా పత్రాల తరలింపునకు జిల్లాలో పది రూట్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రెండు సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు గుర్తించామని... ఈ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలుకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డీటీవో అశోక్ ప్రతాపరావు, ఆర్టీసీ ప్రాంతీయ అధికారి నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.8.71 లక్షలు



స్వామి వారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 23 రోజులకు హుండీల ద్వారా స్వామి వారికి రూ.8.71 లక్షలు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్ తెలిపారు. ఎండోమెంట్స్ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, వానపల్లి పళ్లాలమ్మ ఆలయ ఈఓ బొక్కా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. హుండీల ద్వారా రూ.8.53 లక్షల ఆదాయం వచ్చింది. అన్నదానం హుండీ ద్వారా రూ.18,196 రాగా మొత్తం రూ.8.71 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, కొమ్ముల సూరిబాబు, బొరుసు పార్వతిదుర్గా భవాని, పెదమల్లు ఉషారాణి, ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి



బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్ తదితరులు

ముమ్మిడివరం: స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్ల పనితీరును న్యాయమూర్తులు తనిఖీ చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయన వసతి గృహంలో మౌలిక వసతులపై ఆరా తీశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి విషయాలను పరిశీలించారు. వసతి గృహం పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వసతి గృహ సిబ్బందికి సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశి సిద్ధార్థకుమార్, న్యాయవాదులు కేఎల్‌వీ ప్రసాద్, హలీ హసన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్న నేస్తంతో బాసట

ఆప్కో చైర్మన్ చిరంజీవి



చెక్కులను అందిస్తున్న చిరంజీవి తదితరులు

అమలాపురం రూరల్: జగనన్న నేతన్న నేస్తం పథకంతో ఏటా రూ.24 వేలు అందిస్తూ రాష్ట్రంలో ఉన్న 90వేల మంది చేనేత కార్మికుల జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకురావడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. బండారులంకలో పేరివారికాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 12 చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.75వేలు చొప్పున బుధవారం తక్షణ సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ కోర్టు వివాదం కారణంగా రాష్ట్రంలో చేనేత సొసైటీలకు రూ.16 కోట్ల ఆప్కో బకాయిల చెల్లింపులో జాప్యం జరిగిందని, త్వరలో చెల్లిస్తామని తెలిపారు. తొలుత బండారులంక చేనేత సంఘాన్ని పరిశీలించారు. ఆప్కో డైరెక్టర్ అవ్వారి సుబ్బారాయుడు, వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలేపు నాగ శ్రీనివాస్, చేనేత సొసైటీ చైర్మన్ చింతా ఉమా మహేశ్వరరావు, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కాపు నేతల కృతజ్ఞతలు



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాపు నేతలు

మండపేట: అమలాపురం అల్లర్ల ఘటనలో ప్రభుత్వం కేసులు ఉపసంహరించుకోవడంపై మండపేట కాపు అభ్యుదయ సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో కలిసి మండపేట కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా, సంఘ నాయకుడు సిరంగు శ్రీను తదితరులు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అన్ని సామాజికవర్గాల మధ్య సఖ్యతను పెంపొందిస్తుందన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కాపునేతలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అమలాపురం అల్లర్ల ఘటనపై ఎంతో దూరదృష్టితో సీఎం జగన్ మంచి నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. సామాజికవర్గాల మధ్య విభేదాలను రూపుమాపి పచ్చని సీమలో శాంతి, సామరస్య వాతావరణం, ఐకమత్యం పెంపొందేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు ఘన స్వాగతం

అమలాపురం టౌన్: ఎమ్మెల్యే కోటా ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికై సొంత గడ్డ కోనసీమకు తొలిసారి వచ్చిన బొమ్మి ఇజ్రాయిల్‌కు బుధవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఎమ్మార్పీఎస్ నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుంచి బయలుదేరిన ఆయనను కోనసీమ ముఖద్వారం రావులపాలెం నుంచి అల్లవరం వరకూ దాదాపు 45 కిలోమీటర్ల మేర భారీ ఊరేగింపుతో తోడ్కొని వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఆశీనులయ్యారు. వారు మాట్లాడుతూ మాదిగలను చట్ట సభ ప్రజాప్రతినిధులను చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రాష్ట్ర మాదిగలంతా రుణపడి ఉన్నారని పేర్కొన్నారు. రావులపాలెంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం లభించింది. కొత్తపేట, పలివెల, ముక్కామల, పుల్లేటికుర్రు, అంబాజీపేట, బండార్లంక, అమలాపురం పట్టణం, వై.జంక్షన్, అల్లవరం మీదుగా ఇజ్రాయిల్ సొంతూరు గోడి గ్రామానికి ఊరేగింపు రాత్రి 10 గంటలకు చేరుకుంది. ప్రతీ గ్రామంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు ముఖ్యంగా మాదిగ మహిళలు నుదుట తిలకం దిద్ది హారతులు పట్టారు. పూల మాలలు వేసి సత్కరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జిల్లా చరిత్రలో తొలిసారి మాదిగ నేత ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీని చేసి చట్టసభకు పంపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ఊరేగింపులో అడుగడుగునా ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు జైజైలు పలికి కృతజ్ఞతలు తెలిపారు. తీన్‌మార్ డప్పులతో, బాణసంచా కాల్పులతో ఇజ్రాయిల్ ఊరేగింపు వాహనానికి ఎదురేగి మాదిగలు స్వాగతం పలికారు. జిల్లాలోని మాదిగ పేటల నుంచి ఆ సామాజిక వర్గీయులు రోడ్లపైకి వచ్చి ఇజ్రాయిల్ రాకను ఓ పండగలా స్వాగతించారు. పుల్లేటికుర్రులో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఇజ్రాయిల్ ఊరేగింపు వాహనంపై ఆశీనులై అంబాజీపేట వరకూ కొనసాగారు. అమలాపురం పట్టణ ముఖద్వారం ఈదరపల్లి వంతెన, గడియారం స్తంభం సెంటర్, హైస్కూలు సెంటర్ వై.జంక్షన్‌లో ఇజ్రాయిల్‌కు పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించి స్వాగతించారు. హైస్కూలు సెంటరులో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, రాష్ట్ర మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ స్వాగతం పలికారు.



ముక్కామలలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్. చిత్రంలో ఎంపీ సురేష్, ఎమ్మెల్యే చిట్టిబాబు

ఇక మహా రుడా..

- రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధి మరింత పెంపు
- కొత్తగా కోనసీమ జిల్లా పరిధిలోని కొన్ని గ్రామాల విలీనం
- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, రాజమహేంద్రవరం: గ్రామీణ ప్రాంతాల వికాసానికి మరో కీలక అడుగు పడింది. అభివృద్ధికి మార్గం సుగమమైంది. నగరం, పల్లెలను అనుసంధానిస్తూ రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఇప్పటికే జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వాటి పరిధి మరింతగా విస్తరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కోనసీమ జిల్లా పరిధిలోని నాలుగు మండలాలకు విస్తరిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. 3,142.002 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో మహా రుడాగా ఆవిర్భవించింది. రుడా ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటికి నాలుగుసార్లు విస్తీర్ణం పెంచారు.

విస్తరణ ఇలా...

రుడా తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 17 మండలాలు, 207 గ్రామాల పరిధిలో 1,566.442 చదరపు కిలోమీటర్ల మేర ఉండేది. విస్తరణలో భాగంగా గోపాలపురం నియోజకవర్గం పరిధిలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలతో పాటు, రాజానగరం నియోజకవర్గం పరిధి కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 102 గ్రామాలు కలిశాయి. వీటి విస్తీర్ణం 1,131.60 చ.కి.మీ. వీటితోపాటు అదనంగా ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల మండలంలోని ఆరు గ్రామాల విలీనంతో 17.09 చ.కి.మీ. అదనంగా కలిశాయి. ఫలితంగా మొత్తం 1,148.69 చదరపు కిలోమీటర్ల మేర విస్తరణ పెరిగింది. దీంతో రుడా పరిధి 2,715.132 చదరపు కిలో మీటర్లకు చేరింది. తాజాగా ఈ నెల 21వ తేదీన రావులపాలెం, ఆలమూరు మండలాల పరిధిలో 26 గ్రామాలను విలీనం చేశారు. తద్వారా 150.14 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం పెరిగింది. దీంతో విస్తీర్ణం 2,804.022 చదరపు కిలోమీటర్లకు చేరింది.

విలీనమైన గ్రామాలివే...

రామచంద్రపురం రూరల్: చోడవరం, అంబికపల్లి, అగ్రహారం, నరసాపురపుపేట, ఓడూరు, తాడేపల్లి, యనమదల, కాపవరం, కందులపాలెం, వెల్ల, యేరుపల్లి, ఉట్రుమిల్లి, వెలంపాలెం, జగన్నాయకులపాలెం, ద్రాక్షారామ, వెంకటాయపాలెం, వేగాయమ్మపేట, తోటపేట, హసన్‌బాద, ఉండూరు, భీమక్రోసుపాలెం.

కపిలేశ్వరపురం: నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, నల్లూరు, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిగ, టేకి, వాకతిప్ప, మాచర, కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి.

రాయవరం: లొల్ల, వెదురుపాక, నదురుబాద, సోమేశ్వరం, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపాలెం.

కె.గంగవరం: అద్దంపల్లి, అముజూరు, బాలాంత్రం, భట్లపాలిక, దంగేరు, గంగవరం, గుడిగళ్లబాగ,గుడిగళ్లరాళ్లగుంట, కూళ్ల, కోట, కోటిపల్లి, కందూరు, మసకపల్లి, పామర్రు,పాణింగిపల్లి, పేకేరు, సత్యవాడ, శివల, సుందరపల్లి, తామరపల్లి, వి.గంగవరం, యండగండి, యర్రపోతవరం.

తాజాగా మరోసారి..

తాజాగా ఈ నెల 21వ తేదీన పరిధి పెంచుతూ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం వారం రోజులు తిరగకుండానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మరో నాలుగు మండలాల పరిధిలోని (రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం) 65 గ్రామాలను విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఉత్తర్వులు వెలువరించింది. దీంతో రుడా మహా రుడాగా ఆవిర్భవించింది. ఇప్పటి వరకు 2,804.022 చదరపు కిలోమీటర్ల మేర ఉన్న విస్తీర్ణం..పెరిగిన 338 చదరపు కిలోమీటర్లతో 3,142.002కు చేరింది. ప్రభుత్వ నిర్ణయంతో రుడా 400 గ్రామాల్లో విస్తరించి మహా రుడాగా అవతరించింది.

ఎమ్మెల్యే ప్రతిపాదనలకు ఆమోద ముద్ర

రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల్లోని గ్రామాలను రుడాలో కలపాలని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వీరి అభ్యర్థనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రణాళికా విభాగం ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సైతం పూర్తయింది. ఇటీవల నిర్వహించిన రుడా బోర్డు సమావేశంలో విలీనంపై తీర్మానం సైతం చేశారు. తాజాగా ప్రభుత్వం ఆ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది.

అభివృద్ధి మరింత విస్తృతం



రుడా విస్తరణతో గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్బన్ వెల్ఫేర్‌పై దృష్టి సారించింది. రుడా ఏర్పడిన ఏడాదిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం. భవిష్యత్తులో మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. ఎమ్మెల్యేలు అభ్యర్థించిన వెంటనే గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే జగనన్నకు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఉన్న శ్రద్ధ అర్థమవుతుంది. ఎమ్మెల్యేల సమన్వయంతో విలీన ప్రాంతాల్లో అభివృద్ధికి కృషి చేస్తాం.


– మేడపాటి షర్మిలారెడ్డి, రుడా చైర్మన్

రామాలయానికి పంచలోహ విగ్రహాల సమర్పణ



పంచలోహ విగ్రహాలు, వస్తువులతో దాతలు

తాళ్లరేవు: జార్జిపేటలో ముక్కోటి రామాలయానికి భక్తులు బుధవారం పంచలోహ విగ్రహాలు, వెండి కిరీటాలను సమర్పించారు. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన మేడిశెట్టి వీర్రాజు (రాఘవ), దుర్గాభవానీ దంపతులు సుమారు రూ.2.5 లక్షల విలువైన పంచలోహ విగ్రహాలు, పీఠం, మకర తోరణం, నాలుగు వెండి కిరీటాలు చేయించారు. జార్జిపేటకు చెందిన కాదా సూకరాజు, నాగలక్ష్మి దంపతులు సీతమ్మ వారికి అరకాసు బంగారంతో మంగళ సూత్రాలు సమర్పించారు. వాటికి పండితులు సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కాపుడా), కాకినాడ

సాక్షికి వార్షికోత్సవ శుభాకాంక్షలతో...

1. కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ పరిధిలో కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని మునిసి పాలిటీలు మరియు గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలతో మొత్తము 7 ULBలు మరియు 21 మండలములలోని (వి.జి.పి.సి.పి.ఐ.ఆర్ మరియు సబ్-ప్లాన్ ఏరియా మినహా) మొత్తము 350 గ్రామాలలో 2810.02 చ.కిమీలు పరిధి కలిగి ఉన్నది.
2. కాకినాడ జిల్లాలో కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ పరిధిలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కొరకు భవిష్యత్తు అవసరాలకు దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ తయారు చేయబడుచున్నది.
3. ఎల్.ఆర్.యస్. పథకములో ఇప్పటి వరకు 502 అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించి సుమారు 1152 ప్లాట్లు క్రమబద్ధీకరించబడినవి.
4. అనధికార లేఅవుట్లలో స్థలములు కొనుగోలు చేయవద్దని మనవి. అటువంటి స్థలములలో భవన నిర్మాణములు అనుమతించబడవు.



శ్రీమతి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్
చైర్‌పర్సన్: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కాపుడా), కాకినాడ

క్లుప్తంగా

పెన్సిల్‌తో సిత్రాలు


పెన్సిల్ ముల్లుపై ఆంజనేయ విగ్రహం


శ్రీరాముని చిత్రం


కృష్ణస్వామి

గండేపల్లి: పెన్సిల్‌తో పలురకాల చిత్రాలను గీస్తూ ఆ విద్యార్థి మన్ననలు పొందుతున్నాడు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ 4వ సంవత్సరం చదువుతున్న పెంకే కృష్ణస్వామి శ్రీరామ నవమి సందర్భంగా పెన్సిల్‌తో శ్రీరాముడు, ఆంజనేయుని చిత్రాలు గీసి వాటికి రంగులు అద్దాడు. పెన్సిల్ ముల్లుపై ఆంజనేయుని రూపాన్ని తీర్చిదిద్దాడు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఈ నెల 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 140 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం రసాయనశాస్త్రం -2, వాణిజ్యశాస్త్రం-2 పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జనరల్ విభాగంలో 42,120 మందికి 40,856 మంది హాజరవగా, 1,264 మంది గైర్హాజరయ్యారని వివరించారు. బుధవారం తుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు అయిందన్నారు.

రాములోరి పెళ్లి.. చూసేద్దాం మళ్లీ

- నేడు ఊరూవాడా సీతారామ కల్యాణాలు
- జి.మామిడాడలోని కోదండరామాలయంలో భారీగా ఏర్పాట్లు

పెదపూడి: జగదానంద కారకుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఊరూవాడా రాములోరి పెళ్లి వేడుకలకు సిద్ధమయ్యాయి. చూడముచ్చటైన ఆ ఘట్టాన్ని కనులారా తిలకించేందుకు జనం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కాకినాడ జిల్లాలోని పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రాముడి కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చే వేల్పుగా కోదండరాముడు భక్తుల విశ్వాసం పొందుతున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని భద్రాద్రి రాముడి ఆలయానికి దీటుగా ఈ ఆలయాన్ని నిర్మించారు. రెండవ భద్రాదిగా పేరుగాంచిన ఆలయంలో తూర్పు, పశ్చిమ దిశల్లో నిర్మించిన గోపురాలు అత్యంత ఎత్తైనవిగా పేరుగాంచాయి. వాటిపై శిల్పాలను భాగవత, రామాయణాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దారు.

గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రామాలయం కల్యాణకాంతులను సంతరించుకుంది. గురువారం జరిగే సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల సంఖ్యలో హాజరై భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మంచి ముత్యాలను తలంబ్రాలుగా వాడతారు. కల్యాణ ఉత్సవాలు 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయి.

కల్యాణోత్సవ కార్యక్రమాల వివరాలు

- 31వ తేదీన సుప్రభాత సేవ, నిత్యోపాసన, డోలు సన్నాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- ఏప్రిల్ 1వ తేదీన సహస్రనామార్చన, మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్యం
- 2వ తేదీ ఉదయం శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 3వ తేదీ ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, కంకణ విసర్జనం, పూర్ణాహుతి, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 4వ తేదీ అద్దాల శయన మందిరంలో రాత్రికి ఊయల సేవ, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.


జి.మామిడాడలో కొలువైన సీతారాములు వారు


జి.మామిడాడలో కోదండ రామాలయం గోపురాలు


ఆకట్టుకునే అద్దాల మందిరం

ఇదీ ఆలయ చరిత్ర

క్రీస్తు శకం 1889లో గొల్లల మామిడాడ గ్రామస్తులు ద్వారంపూడి సుబ్బిరెడ్డి, రామారెడ్డి చిన్న రామాలయాన్ని నిర్మించి అందులో సీతాసమేత శ్రీ రామచంద్రుడి కర్ర బొమ్మ(కోలలు) నిర్మించి ప్రతి రోజూ ధూప దీప నైవేద్యాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. కాలక్రమేణా కోలలు స్థానే 1939లో శిల్ప కళా శోభితమైన శ్రీ రామలక్ష్మణ సీతాహనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1950లో పశ్చిమ గోపురం, 1956లో తూర్పు గోపురాన్ని నిర్మించి, ఈ రెండు గోపురాల మధ్య ఆనుకుని పైన ఒక మంటపాన్ని నిర్మించి అందులో మయసభ, సుందరమైన అద్దాల మందిరం నిర్మించారు.

అయోధ్య రాముడి కల్యాణం అర్ధరాత్రి

- చేబ్రోలులో ఏళ్ల తరబడి ఆచారం

పిఠాపురం: ఏటా శ్రీరామ నవమి రోజున మధ్యాహ్నం శ్రీసీతారాముల కల్యాణం అన్నిచోట్లా జరగడం ఆచారం. అయితే కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మాత్రం ఆరోజు అర్ధరాత్రి నిర్వహిస్తారు. రాత్రి 10 గంటల తరువాతే పెళ్లి తంతు ప్రారంభమవుతుంది. కల్యాణం పూర్తయ్యే సరికి అర్ధరాత్రి దాటుతుంది. ఈ ఆచారం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. పూర్వం రాజుల కాలంలో నిర్మించినన ఈ ఆలయానికి ఒక చరిత్ర ఉంది. పూర్వం సీతా రాముల కల్యాణాలు ఆయా రాజుల ఆధ్వర్యంలో నిర్వహించేవారు. రాజు గారు వచ్చినప్పుడే కల్యాణం ప్రారంభమయ్యేది. పిఠాపురం సంస్థానాధీశులు పూర్వం తమ సంస్థానం పరిధిలో శ్రీరామ నవమి నాడు అన్ని ఆలయాలకు వెళ్లి పూజలు చేసి చివరకు చేబ్రోలు ఆలయానికి చేరుకునే సరికి అర్ధరాత్రి అయ్యేది. ఆయన వచ్చాకా కల్యాణం జరిపించేవారు. వందల ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతుండడంతో దానిని ఇప్పటికీ అమలు చేస్తున్నారు. భద్రాద్రి రాముని కల్యాణం సైతం పగలు జరుగుతుండగా ఇక్కడ మాత్రమే రాత్రి పూట జరగడం విశేషమని ఆలయ అర్చకులు రేగేటి రామాచార్యులు తెలిపారు. ఈ ఏడాది గురువారం అర్ధరాత్రి సీతారాముల కల్యాణం భక్త జన సందోహం నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.


చేబ్రోలులో అర్ధరాత్రి రాముల వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)


చేబ్రోలులో శ్రీసీతారాముల వారు

కుమార్తెను చూడకుండానే...

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో మృతి చెందిన నాగేశ్వరరావు

రాయవరం: ప్రాణప్రదంగా చూసుకుంటున్న కుమార్తెను కనులారా చూసుకుందామని బయలుదేరిన తండ్రి గ్రామ సమీపంలోనే అసువులు బాసాడు. కపిలేశ్వరపురం మండలం కాలేరుకు చెందిన నాగేశ్వరరావు(48) రాయవరం మండలం మాచవరం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి మృతి చెందాడు. మాచవరం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. గతంలోనే భార్యను కోల్పోయిన నాగేశ్వరరావు భర్త వద్ద ఉన్న కుమార్తెను చూడడానికి బయలుదేరాడు. కుమార్తె ఇంటికి చేరుకొనేంతలోనే నాగేశ్వరరావును లారీ ఢీకొనడంతో ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. రాయవరం పోలీసులు విచారణ చేపట్టారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

సామర్లకోట: రైలు పట్టాలపై ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. జి. మేడపాడు-సామర్లకోట మధ్యలో రాజమహేంద్రవరం వైపు వెళ్లే పట్టాలపై మృతదేహాన్ని రైల్వే కీ మేన్ గుర్తించి స్టేషన్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశాడు. దాంతో ఎస్ఎస్ శేషకృష్ణకాంత్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు బుధవారం ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాల వయసు, చామనఛాయ, 5.4 ఎత్తు ఉండగా, తెలుపు ఫుల్ హ్యాండ్స్ షర్టు, తెలుపు లుంగీ ధరించి ఉన్నాడని రైల్వే పోలీసుల తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

PRAGATI ENGINEERING COLLEGE (Autonomous)
(Approved by AICTE, New Delhi, Permanently Affiliated to JNTUK, KKD, Accredited by NBA & Accredited by NAAC with 'A' Grade)
Recognized by UGC under sections 2 (f) & 12 (b) of the UCG act, 1956
ADB Road, SURAMPALEM, Nr. Peddapuram, Kakinada Dist.
www.pragati.ac.in
RECRUITMENT @ PRAGATI
* Professors * Assoc.Professors * Asst.Professors
Applications are invited from talented individuals who are aspiring for prosperous careers in Teaching and Research in the following programes.
* CSE * CSE (AI&ML) * CSE (DS) * CSE (AI) * IT * CIVIL * EEE * ME * ECE * English * Maths * Physics * Chemistry * Env. Studies * Soft Skills * Management Studies
* Qualification and Salary as per AICTE norms.
Non-Teaching Staff :
* Programmers * Lab Technicians, * Computer Operators * Attendars
Interested candidates can apply online at http://careers.pragati.ac.in. Alternatively they can apply with copies of all relevant educational qualifications and experience certificates with latest passport size photograph by sending their application to recruitment@pragati.ac.in.
Contact Number : 73308 26667
Date : 29-03-2023 Sd/- PRINCIPAL

స్కిల్ డెవలప్‌మెంట్ భారీ కుంభకోణం

- స్కాంలో చంద్రబాబుదే కీలక పాత్ర
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.370 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని, ఇందులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాత్ర ఉందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆరోపించారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీమెన్స్ సంస్థ రూ.3,300 కోట్లలో ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండానే.. నాటి చంద్రబాబు ప్రభుత్వం తన వాటా అయిన రూ.370 కోట్లు విడుదల చేసేసిందన్నారు. వీటిని 'దోచుకో.. పంచుకో.. తినుకో' నినాదంతో పంచుకుతిన్నారని దుయ్యబట్టారు. ఇంత త్వరగా నిధుల విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం కారణమని అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి తమ నోట్‌ఫైల్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. నిధులను సీమెన్స్‌తో పాటు పీవీఎస్‌పీ(స్కిల్లర్స్), డిజైన్‌టెక్ వంటి సంస్థలతో డొల్ల కంపెనీలు సృష్టించి దోచుకున్నారని ఆరోపించారు. విభజిత రాష్ట్రంలో నిధుల కొరత ఉందని హుండీలు పెట్టి మరీ డబ్బులు వసూలు చేసిన బాబు ఇంత పెద్ద మొత్తం ఎలా విడుదల చేశారని విస్మయం వ్యక్తం చేశారు. ఈ కుంభకోణంలో సీమెన్స్ సంస్థ ప్రతినిధి సౌమ్యాద్రి శేఖర్‌బోస్ చక్రం తిప్పారన్నారు. అక్రమ బాగోతంపై జీఎస్టీ శాఖ దృష్టి సారించడంతో బండారం బట్టబయలైందన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర సీఐడీ విభాగం రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించిందన్నారు. జర్మనీలోని సీమెన్స్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సీఐడీ సంప్రదించగా ఇలాంటి శిక్షణ ఇస్తామన్న ప్రతిపాదన ఏదీ చేయలేదని స్పష్టం చేసిందన్నారు. సీమెన్స్ సంస్థ భారత విభాగానికి చెందిన ఇద్దరు ఉన్న ఉద్యోగులు, మరికొందరు స్థానిక కంపెనీ ప్రతినిధులతో కలిసి రూ.370 కోట్లు మింగేశారని వివరించారు. భారీ కుంభకోణానికి బాధ్యులైన చంద్రబాబు, లోకేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న సీబీఐ విచారణ

అమలాపురం టౌన్: విలస పోస్టాఫీసులో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఏపీపీబీ) నిధులు రూ.1.18 కోట్లు గోల్‌మాల్ అయిన కేసుకు సంబంధించి అమలాపురం హెడ్‌పోస్టాఫీసులో జరుగుతున్న సీబీఐ విచారణ రెండో రోజు బుధవారం కూడా కొనసాగింది. విశాఖపట్నం సీబీఐ అధికారుల బృందం మంగళవారం ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకూ విచారణ చేసిన సంగతి తెలిసిందే. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉంటున్న స్థానిక హెడ్ పోస్టాఫీసులో సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసిన సతీష్ సీబీఐ విచారణకు బుధవారం హాజరయ్యాడు. నిధుల దుర్వినియోగంపై సతీష్‌ను సీబీఐ అధికారులు దాదాపు అయిదు గంటలపాటు విచారించారు. ఇప్పటికే సస్పెండ్ అయిన పోస్టల్ అసిస్టెంట్ మహాలక్ష్మిని కూడా రెండో రోజూ అధికారులు మరోసారి విచారించారు. ఈ నిధులు దుర్వినియోగంలోని బాధ్యులు ఒక్కొక్కరిని సీబీఐ అధికారులు విచారిస్తుండడంతో కీలక అంశాలపై ఆధారాలతో కూపీ లాగారని తెలిసింది. విచారణ మూడో రోజు గురువారం కూడా కొనసాగనుంది.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి


దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద బోల్తాపడిన ట్రాక్టర్

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం వద్ద హైవేపై బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం జార్ఖండ్‌లోని పశ్చిమశింబుమ్ జిల్లా చాయ్ బాషా గ్రామానికి చెందిన సందీప్ దేవగాన్ ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం విజయనగరంలో నారాయణస్వామి వద్ద పనిచేస్తున్నాడు. అక్కడ పనిపూర్తి కావడంతో ఎలక్ట్రికల్ సామాన్లను ట్రాక్టర్‌పై వేసుకుని మంగళవారం విజయనగరం నుంచి నంద్యాలకు వెళుతున్నాడు. ట్రాక్టర్ తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద హైవేపై కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి వస్తూ ట్రాక్టర్‌ను ఢీ కొంది. ట్రాక్టర్ బోల్తాపడింది. బస్సు ముందు బాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా కొనగట్ల మండలం, చినమనగూడెంకు చెందిన బస్సు డ్రైవర్ పొన్నగంటి నారాయణరావు, ట్రాక్టర్ డ్రైవర్ నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్‌తో పాటు ఉన్న మరొక డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా తలకు, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇద్దరు గోదావరిలో దూకి ఆత్మహత్య

యానాం: వివిధ కారణాలతో గౌతమీ గోదావరిలో దూకి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారని బుధవారం ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. మొదటి ఘటనలో ఈ నెల 27న యానాం ఫెర్రీ ఏరియాలోని కేవీఆర్ నగర్‌కు చెందిన పోతాబత్తుల మహేష్ (21) జీవితంపై విరక్తితో యానాం-ఎదుర్లంక బాలయోగి వారధిపైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. అతని కోసం మూడురోజులుగా గోదావరిలో గాలించగా బుధవారం మృతదేహం లభ్యమయ్యిందన్నారు. రెండవ ఘటనలో గండేపల్లి మండలం మురారీకి చెందిన కాకర్ల వీరశివశంకర్(29) బుధవారం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని మృతదేహాన్ని ఎస్‌ఈసీ జెట్టీ వద్ద కనుగొన్నామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం యానాం జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగుడిపై తేనెటీగల దాడి

- పరిస్థితి విషమం
- రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలింపు


గాయపడిన లక్ష్మణరావు

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెంలో దివ్యాంగుడిపై తేనెటీగలు దాడి చేశాయి. దాడిలో యంగల లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన లక్ష్మణరావును చికిత్స కోసం యాదవోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా సుమారు 50 తేనెటీగల ముళ్లు తొలగించారు. అయినప్పటికి లక్ష్మణరావు పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో గల మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుకు తేనెపట్టు పట్టింది. తరచూ తేనెటీగలు స్థానికులపై దాడి చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

హత్య కేసులో భార్య, ప్రియుడికి జీవిత ఖైదు

- రూ.20 వేల చొప్పున జరిమానా

కాకినాడ లీగల్: పథకం ప్రకారం భర్తను హత్య చేసిన కేసులో భార్యకు, ఆమె ప్రియుడికి జీవితఖైదు, రూ.20 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మద్దూరి శామ్యూల్‌తో విజయ కుమారికి 2007లో వివాహం అయింది. వివాహం అనంతరం కాకినాడ జగన్నాథపురం, జమ్మి చెట్టు సెంటర్‌లో నివాసం ఉండేవాడు. శామ్యూల్ భార్య మద్దూరి విజయకుమారికి తన స్నేహితుడు రాజమహేంద్రవరానికి చెందిన ఈపి గోపితాతారావుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో 2013 జూన్ 20వ తేదీన శామ్యూల్‌ను అడ్డు తప్పించడానికి పథకం ప్రకారం భార్య పాలలో నిద్రమాత్రలు కలిపి శామ్యూల్‌కు ఇవ్వడంతో నిద్రలోకి వెళ్లగా స్కిప్పింగ్ వైరుతో గొంతు బిగించి హత్య చేశారు. మృతుడు తండ్రి మద్దూరి ప్రభుదాసు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి కాకినాడ వన్ టౌన్ ఎస్సై పెద్దిరెడ్డి రామచంద్రరావు కేసు నమోదు చేయగా అప్పటి సీఐ జి.దేవకుమార్ దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో భార్య విజయకుమారి, ఆమె ప్రియుడుపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఆదిత్యకుమార్ వాదనలు వినిపించారు.

ఏవోబీ నుంచి న్యూఢిల్లీకి గంజాయి తరలిస్తూ..

- హుకుంపేటలో పోలీసులకు చిక్కిన ఏడుగురి అరెస్టు
- 120 కిలోల సరకు, వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: ఏవోబీ నుంచి న్యూఢిల్లీకి గంజాయి తరలిస్తున్న ఏడుగురిని హుకుంపేటలోని మూడుగుళ్ల సెంటర్‌లో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 120 కిలోల గంజాయి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. అందిన సమాచారం మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు, సిబ్బంది బుధవారం మూడుగుళ్లసెంటర్‌లో ఒక ఇంటిలో ఐదుబస్తాలలో ఉన్న 120 కిలోల గంజాయితో పాటు, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖజిల్లా సన్యాసిరాజుపాలెం పంచాయతీకి చెంది, ప్రస్తుతం హుకుంపేట మూడుగుళ్ల వీధిలో ఉంటున్న మొగిలి సూర్యనారాయణ, ఏఎస్ఆర్‌జిల్లా చింతపల్లి మండలం చింతలూరు గ్రామానికి గెమ్మిలి నాగేశ్వరరావు, వంగసార గ్రామానికి చెందిన సిందేరి రమేష్, శ్రీసత్యసాయిజిల్లా కొత్తచెరువుకు చెంది ప్రస్తుతం హుకుంపేట పంచాయతీ రామకృష్ణనగర్‌లో ఉంటున్న ముత్తరాసి నరేష్, సౌత్ వెస్ట్‌ఢిల్లీకి చెందిన టోనీసచ్‌దేవ్, ప్రిన్స్‌గిల్డియార్(ప్రిన్స్), వెస్ట్ ఢిల్లీకి చెందిన అర్జున్‌గోపాల స్వామి(శశి)లను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.7.50 లక్షలు ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన గంజాయిని నిందితులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించారన్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి తూర్పు మండల డీఎస్పీ భక్తవత్సలం అభినందించారన్నారు.

క్రీడలతో అంకితభావం, ఆరోగ్యం


విజేతలతో అధికారులు

రాజానగరం: అటవీ శాఖలో ఉన్న వారికి క్రీడలు, యోగా, వ్యాయామం వంటివి ఆరోగ్య పరిరక్షణతోపాటు విధి నిర్వహణలో అంకితభావాన్ని, క్రమశిక్షణను అలవరుస్తాయని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ పీఏవీ ఉదయ్ భాస్కర్ అన్నారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న ఫారెస్టు సెక్షన్ అధికారులు, ఫారెస్టు బీట్ అధికారులకు బుధవారం గేమ్స్ అండ్ స్పోర్ట్సు మీట్ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అకాడమీ డైరెక్టర్ మాట్లాడుతూ అకాడమీలో ఆరు మాసాలు, ఏడాది కాలం శిక్షణ పొందే ఉద్యోగులకు క్రమబద్ధమైన, ఆరోగ్యవంతమైన జీవిత విధానాన్ని అలవాటు చేయడం కోసం వీటిలో ప్రతిరోజు శిక్షణ కూడా ఇస్తామన్నారు. రన్నింగ్, షాట్ పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, తదితర క్రీడలలో విజేతలను ప్రకటించి బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో స్పోర్ట్సు ఇన్‌చార్జి టి.చక్రపాణి, ఏసీఎఫ్‌లు ఎన్‌వీ శివరామప్రసాద్, వి.శ్రీహరి గోపాల్, ఏవీ రమణమూర్తి, టి.శ్రీనివాసరావు, రేంజ్ అధికారి టి.అనూష పాల్గొన్నారు.

శాంతిని కోరుతూ సైకిల్ యాత్ర


రావులపాలెంలో మాట్లాడుతున్న సైకిల్ యాత్రికుడు గోపాలకృష్ణ

రావులపాలెం: దేశంలో శాంతిని నెలకొల్పాలని దేవుళ్లను ప్రార్థిస్తూ సైకిల్‌పై యాత్ర చేసుకుంటూ ఆయా పుణ్యక్షేత్రాలను సందర్శించుకుంటున్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన విజయ్ గోపాలకృష్ణ బుధవారం రావులపాలెం చేరారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్లో ఆయన తన యాత్ర విశేషాలను ‘సాక్షి’కి వివరించారు. 2022 మార్చి 11న సింధనూరులో సైకిల్ పై ప్రారంభమైన యాత్ర అక్కడి నుంచి దాదాపు 13 రాష్ట్రాల మీదగా సాగిందన్నారు. ఉదయం మొదలుపెట్టి, మధ్యాహ్న సమయంలో కాస్త విశ్రాంతి తీసుకుని, మరలా యాత్రను కొనసాగిస్తున్నట్టు వివరించారు. ఇప్పటివరకు ఘూనాపూర్, తుల్జాపూర్, షిరిడి, నాసిక్, త్రయంబకేశ్వరం, కాశి, అయోధ్య, అగ్రా, లక్నో, మధుర, హరియానా, పంజాబ్, తిరుపతి, రామేశ్వరం మంత్రాలయం ప్రాంతాల్లో ఆలయాలను దర్శించుకున్నానని చెప్పారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళుతున్నట్టు గోపాలకృష్ణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ టెన్త్, ఇంటర్ వన్‌సిట్టింగ్ (రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిల్ అయినవారు కట్టుకొనే అవకాశం) డిగ్రీ, పీజీ, (సైన్స్ & ఆర్ట్స్) MBA, B.Li.Sc, M.Li.sc, ఎగ్జామ్స్ అన్నీ మా విద్యాసంస్థల్లో జరుగును. 100% పాస్. మా ఆఫీస్ & కాలేజి కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, కాకతీయ విద్యా సంస్థలు. 2023 - 2024 అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 98495 82043, అత్రేయపురం ఫోన్: 83414 82043, రాజమండ్రి ఫోన్: 99494 82757 [V-1799]

Real Estate

కొబ్బరితోట అమ్మకమునకు కలదు

■ ఐ.పోలవరం (M) తిల్లకుప్ప శివారు శ్రీ రంగరాజపురం (దొడ్డిపట్ల)గ్రామం దగ్గర కొబ్బరి తోట 7.కుం.35.lK & బొమ్మూరు (RJY)లో డాబా ఇల్లు అమ్మబడును. ✆ : 94908 75442, 70930 84602 [R-1154803]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 S [R-5758]

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2332]

Wanted

■ All Banks authority chanal partner wanted Female Tele Callers only Rajahmundry. Cell : 73868 66402 [R-4616]

■ ప్రముఖ బ్యాంకు మరియు సంస్థలో పని చేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ప్రదేశం: రాజమండ్రి, రావులపాలెం, జగ్గంపేట, గోకవరం. సంప్ర: 83411 69265 [B-1045]

■ JOB VACANCY. Age 18 to 45, 10th to Any Degree, Office job 18,000 to 25,000, Work from home 15,000 to 18,000, ✆ 8712008071 [T-1186]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]

■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-28700]

■ కాకినాడ, కత్తిపూడి, పెద్దాపురం, సామర్లకోట ఏరియాలలో ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీ నందు పనిచేయుటకు ఫీల్డ్ ఆఫీసర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు PF & ESI సదుపాయం కలదు. 73822 51616, 94937 85599 [R-1727]

■ ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్‌కేర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్ వైజర్స్ కావలెను. Qly: 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/- To 29,000/- రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18-35 సం॥. ✆ 8885039153. [B-762883]

■ ప్రముఖ సంస్థయందు పనిచేయుటకు టెలికాలర్స్, ఆఫీస్ అసిస్టెంట్లు, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, గార్డులు కావలెను. అర్హతగల వారికి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ వాట్సాప్ నెంబర్: 9491376845, 8331040530 [HA-10925]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795283]

■ అత్యంత విశ్వసనీయ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ నందు పార్ట్ టైం & ఫుల్ టైం. వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగ అవకాశాలు, రియల్ ఎస్టేట్, రిటైర్డ్ పర్సన్స్, హౌస్ వైఫ్‌లకు ప్రాధాన్యత ✆ : 96037 57365, 63040 59963 [R-1188070]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.